పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ముదిగొండ మండలం ఎడవల్లిలో పర్యటన
- లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

వివరాలు : 6లో



శంకుస్థాపన పూజ చేస్తున్న భట్టి



ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నేతలు

తెలుగు వారి ఆరాధ్య దైవం ఎన్టీఆర్

- బడుగు బలహీనవర్గాల గుండెల్లో నిలిచారు
- జయంతి సందర్భంగా అన్నకు పలువురు నేతల నివాళి

7



మహిళా మార్ట్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

మహిళలు ఆర్థికంగా ముందడుగేయాలి

- డ్వాక్రా ఉత్పత్తులు దేశ విదేశాలకు ఎగుమతి కావాలి
- పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దితేనే పేదరికం నుంచి విముక్తి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మంలో తొలి మహిళా మార్ట్ ప్రారంభం

ఖమ్మం, మే 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మహిళలు ఆర్థికంగా ముందడుగు వేయాలని, డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు తయారుచేసే ఉత్పత్తులు దేశ, విదేశాలకు ఎగుమతి కావాలన్నదే ప్రభుత్వ విధానమని, ఇందుకోసం ప్రభుత్వం వారిని అన్ని విధాలా (మిగతా 6వ పేజీలో)

అంగన్‌వాడీ భవనాలను

వేగంగా పూర్తి చేయాలి

- దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉంది
- ప్రతీ మారుమూల ప్రాంతానికి సురక్షిత నీరు అందించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికారులతో సమీక్ష



కొత్తగూడెం, మే 28 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలు, పాఠశాలలను గుర్తించి వాటిలోకి అంగన్‌వాడీ కేంద్రాలను మార్చాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని, విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉంటుందన్నారు. త్వరలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని, ఎవరైనా అంగన్‌వాడీ అధికారులు చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంగన్‌వాడీ, పంచాయతీ రాజ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అంగన్‌వాడీల్లో కాంట్రాక్టర్లు నాణ్యత లేని ఆహారాన్ని సరఫరా చేస్తే వెంటనే తిరస్కరించాలని, పిల్లల్లో పౌష్టికాహారం లోపం లేకుండా నాణ్యమైన ఆహారం మాత్రమే అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లల ఆలనా.. పాలనా చూసుకునేందుకు ప్రభుత్వం క్రస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఇక వయోవృద్ధుల సంక్షేమానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, ఆస్తులు తీసుకుని తల్లిదండ్రులను సక్రమంగా చూడని వారసులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో త్వరలోనే ఫిజియోథెరపీ సేవలను ప్రారంభిస్తామన్నారు. వికలాంగులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, వయోవృద్ధులకు టేకేర్ సెంటర్లను ఏర్పాటుచేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి అంగన్‌వాడీ పిల్లల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడాలన్నారు. అలాగే ప్రతీ మారుమూల ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని, వారం రోజులపాటు (మిగతా 6వ పేజీలో)

సింగరేణిలో సీబీఎస్ఈ

- జూన్ 12న గోదావరి ఖని సెక్టార్ -3లో ప్రారంభానికి ఏర్పాట్లు
- సింగరేణికి 408 సీట్ల కేటాయింపు.. వచ్చిన దరఖాస్తులు 1,650

వివరాలు : 6లో



మెట్ట పంట కోసం జూలూరుపాడులో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న దృశ్యం

సాగుకు సై

వరుణుడు ముందే కరుణిస్తుండడం.. తొలకరికి ముందే ఉమ్మడి జిల్లాలో వర్షాలు పలకరిస్తుండటంతో రైతన్నలు సాగుకు సై అంటున్నారు. ట్రాక్టర్లు, నాగళ్లతో పొలాలను దున్నడంతో పాటు విత్తనాలు వేసేందుకు అచ్చులు తోలుతున్నారు. వాస్తవానికి జూన్ రెండో వారం నుంచి తొలకరి పనులు ప్రారంభమవాల్సి ఉండగా.. ఈ సారి 15 రోజుల ముందే సీజన్ వచ్చిందంటూ రైతులు ఉత్సాహంగా ఉన్నారు. కానీ ముందే విత్తనాలు విత్తితే 'కాలం' కలిసిరాకపోతే.. ఎక్కడ నష్టం వాటిల్లుతుందోనన్న భయం కూడా వారిలో కనిపిస్తోంది.

- ముందే వరుణుడి కరుణతో రైతుల్లో ఆశలు
- వానాకాలం వ్యవసాయ పనులకు సిద్ధమైన అన్నదాతలు
- దుక్కులకు ముమ్మర ఏర్పాట్లు.. విత్తనాల కోసం వేట
- భవిష్యత్ 'కాలం'పై భయంతోనే అడుగులు

ఖమ్మం, మే 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వారంరోజులుగా అడపాదడపా కురిసిన వర్షాలకు తోడు మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా పడిన వాన.. దుక్కులకు అనుకూలంగా మారింది. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన నేపథ్యంలో ఈ వాననే తొలకరిగా భావిస్తున్న రైతులు సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. విత్తనాలు, ఎరువులను ముందుగానే కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను తీసుకుంటున్న రైతులు.. వరి విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ప్రైవేట్ డీలర్లు, షాపులకు వెళ్లి విత్తనాల కోసం ఆరా తీస్తున్నారు. ఏ విత్తనం వేస్తే అధిక దిగుబడులు వస్తాయంటూ సలహాలు తీసుకుంటున్నారు.

'నకిలీ'ల ఆటకట్టించేలా..

దొంగచాటుగా జిల్లాలోకి నకిలీ విత్తనాలు రవాణా అయ్యే పరిస్థితి ఉండడంతో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయశాఖలు సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను కూడా ఏర్పాటు చేశాయి. వ్యవసాయ దుకాణాలతో పాటు గ్రామాల్లో పెద్ద రైతులను కూడా అనధికారిక విత్తనాలపై ఆరా తీస్తున్నారు. జిల్లాలో వర్షాకాలంలో వ్యవసాయశాఖ రైతులకు అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉంచగా.. డీలర్ల వద్ద కూడా నిల్వలున్నాయి.

- ఖమ్మం జిల్లాలో వానాకాలంలో 5,80,232 ఎకరాలు పంట సాగుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో వరి 3,04,869 ఎకరాలకుగాను 76,217 క్వింటాళ్ల విత్తనాలు (మిగతా 6వ పేజీలో)



అలుగు పోస్తున్న చింతకాని మండలం నేరడ గట్టు బంధం చెరువు

లాహిరి.. లాహిరి.. రోహిణిలో..

7

భద్రాద్రి కలెక్టర్ సతీమణికి

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం

సర్కారు వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచేలా కలెక్టర్ దంపతుల నిర్ణయం



వైద్యులతో ఆనందం పంచుకుంటున్న కలెక్టర్



కలెక్టర్ జితేష్‌ను సత్కరిస్తున్న మంత్రి సీతక్క

పాల్వంచ టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొందించేలా భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వీ పాటిల్ దంపతులు ఓ నిర్ణయం తీసుకున్నారు. సామాన్యులకు సైతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయనే విషయాన్ని అందరికీ తెలిపేలా.. సర్కారు దవాఖానాలో కాన్పు చేయించి ఆదర్శంగా నిలిచారు. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్, శ్రద్ధ దంపతులకు తొలుత ఓ కుమారుడు జన్మించాడు. ఇక శ్రద్ధ రెండో సారి గర్భం దాల్చినప్పటి నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలోనే పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యసేవలు పొందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆమెను కాన్పు నిమిత్తం అదే ఆస్పత్రిలో చేర్పగా.. ఆమెకు వైద్యులు సర్జరీ చేశారు. ఈ క్రమంలో కలెక్టర్‌కు రెండో సంతానంగా పండంటి మగబిడ్డ జన్మించాడు. దీంతో కలెక్టర్ జితేష్ పుత్రోత్సాహంతో పొంగిపోయారు. తన సతీమణికి మంచి వైద్య సేవలందించిన వైద్యులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులో తెచ్చిందని, అన్ని విభాగాల వైద్య నిపుణులు కూడా అందుబాటులో ఉన్నారని, ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బు వృథా చేసుకోకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలను వినియోగించుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆయన సూచించారు.

కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు సీతక్క సత్కారం

సర్కారు వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచేలా.. తన సతీమణికి పాల్వంచ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రసవం చేయించిన కలెక్టర్‌ను పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క సత్కరించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష జరిగిన అనంతరం మంత్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను అభినందించగా.. ఆమె పాటు ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు కూడా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



మదన్‌లాల్ పాడె మోస్తున్న పువ్వాడ, వద్దిరాజు

మదన్‌లాల్ అంత్యక్రియలు పూర్తి

- నివాళులర్పించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పాడె మోసిన మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు

6



రూ.4.15కోట్ల గంజాయి పట్టివేత

- 8.30 క్వింటాళ్ల సరుకు, మినీ కంటెయినర్ సీజ్
- 9 మందిపై కేసు నమోదు.. ఇద్దరి అరెస్ట్.. పరారీలో ఏడుగురు
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

7



నేడు ముగ్గురు మంత్రుల సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఖమ్మం కలెక్టరేట్‌లో 10గంటల నుంచి 2 గంటల వరకు జరిగే ఈ సమీక్షలో వారు ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయ సీజన్ ప్రారంభం, అధికారుల సన్నద్ధత, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి తదితర పథకాలపై సమీక్షించనున్నారు.

ఆర్మీ జవాన్‌కు గ్రామస్థుల సన్మానం

- ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న దమ్మిలాల్
- సెలవుపై స్వగ్రామం వచ్చిన నేపథ్యంలో ఘన స్వాగతం



ఆర్మీ జవాన్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

ఇల్లెందురూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి):ఆపరేషన్ సిందూర్‌లో దేశం తరఫున ఆర్మీలో విధులు నిర్వహించి సెలవుపై స్వగ్రామానికి వచ్చిన ఆర్మీ జవాన్‌ను ఇల్లెందు మండలం పోలారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. పోలారం గ్రామానికి చెందిన బానోత్ దమ్మిలాల్ జమ్ముకశ్మీర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో ధైర్య సాహసాలతో తన విధులను నిర్వహించి సెలవులపై సోమవారం స్వగ్రామానికి వచ్చిన దమ్మిలాల్‌ను గ్రామస్థులు అభినందనలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరోజన, రామచంద్ర, మంగ్య, శంకర్, సురేష్, రమేష్, భావ్ సింగ్, విజయ్, రాందాస్, రవికుమార్, లక్మణ్, సుమన్, భద్రు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో సీబీఎస్ఈ విద్యా విధానం

- జూన్ 12న గోదావరి ఖని సెక్టార్ -3లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- సింగరేణికి 408 సీట్లు కేటాయిస్తే.. వచ్చిన దరఖాస్తులు 1650

రుద్రంపూర్, (సింగరేణి) మే 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సీబీఎస్ఈ విద్యా విధానాన్ని ప్రారంభించేందుకు యాజమాన్యం రంగం సిద్ధం చేస్తోంది. ఇంగ్లీష్ మీడియంపై పట్టు సాధించే విధంగా విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యాబోధన అందించాలనే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచే సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విద్యా విధానాన్ని ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు యాజమాన్యం చేసింది. సింగరేణి పరిధిలోని గోదావరిఖని సెక్టార్-3లో జూన్ 12న తరగతులను ప్రారంభించనున్నారు. 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యాబోధన చేసేందుకు కేంద్రం నుంచి అనుమతులు లభించాయి. మొత్తం 9తరగతులకు సంబంధించి 408 సీట్లను కేటాయించగా అడ్మిషన్ల కోసం 1650 దరఖాస్తులు రావడం గమనార్హం. సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం సీబీఎస్ఈ విద్యా విధానాన్ని సింగరేణిలో ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో గత రెండేళ్ల నుంచి ప్రతిపాదనలను రూపొందించారు. సీబీఎస్ఈ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు పాఠశాల ప్రాంగణాలు, తరగతి గదులు, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, క్రీడాస్థలాలు, కంప్యూటర్ క్లాస్‌లను తనిఖీ చేసిన బృందం గోదావరిఖని సెక్టార్-3లో అనుమతులను మంజూరు చేసింది. దీంతో సింగరేణిలోని గోదావరిఖని, మందమర్రి ప్రాంతాలకు చెందిన కార్మికుల పిల్లలకు విద్య అందే అవకాశాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే సింగరేణిలో 9 ఏరియాల్లో పాఠశాలలను డిగ్రీ, జూనియర్ మహిళ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలు నడుపుతున్న సింగరేణి యజమాన్యం ఈ ఏడాది నుంచి సీబీఎస్ఈలోకి రంగ ప్రవేశం చేయనుంది.సింగరేణిలో 2017లో కారుణ్య నియామకాల ద్వారా కార్మికుల వారసులకు ఉద్యోగ అవకాశాన్ని యాజమాన్యం కల్పిస్తోంది.



ఇప్పటికే కారుణ్య నియామకాల ద్వారా 15 వేల మందికి పైగా కార్మికులు విధుల్లో చేరారు. కార్మికుల వారసులు తమ పిల్లలకు ఇంగ్లీష్ విద్యను అందించేందుకు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో సింగరేణిలోనే సీబీఎస్ఈ విద్యను ప్రవేశపెట్టాలనే యాజమాన్యం చేసిన ప్రయత్నం సఫలమైంది. కార్మికుల వారసుల డిమాండ్‌కు తగ్గట్లు మరిన్ని పాఠశాలలను ప్రారంభించే దిశగా సింగరేణి యాజమాన్యం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, భూపాలపల్లి ప్రాంతాల్లో వచ్చే ఏడాది నుంచి సీబీఎస్ఈని ప్రవేశపెట్టాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తోన్నారు.



మెరుగైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యం

బలరాం, సింగరేణి సీఎండీ

కార్మికుల వారసులకు మెరుగైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం ప్రయత్నిస్తోంది. భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించేందుకు సింగరేణిలో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెడుతు న్నాం. పోటీపరీక్షలకు సిద్ధం కావాలంటే ప్రాథమిక విద్య పునాదులు బలంగా ఉండాలనే సంకల్పంతో సింగరేణిలో సీబీఎస్ఈని తెచ్చాం. భవిష్యత్‌లో సింగరేణి కార్మికులతోపాటు సమీప ప్రాంత ప్రజానీకానికి ఉపయోగపడే విధంగా అన్ని ఏరియాల్లో సీబీఎస్ఈని నెలకొల్పే దిశగా ప్రయత్నిస్తున్నాం.

సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్‌లో మెరిసిన

వేసవి శిబిరం బాలబాలికలు

వరించిన ఆరు పతకాలు

చుంచుపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో వేసవి శిక్షణ శిబిరంలో తరగతులకు హాజరవుతున్న బాల, బాలికలు మెరిశారు. ఇటీవల పాల్వంచలో ముగిసిన సబ్ జూనియర్స్ డే అండ్ నైట్ అథ్లెట్స్ చాంపియన్ షిప్ 2025లో రామవరం సాధన క్రీడా మైదానంలో అథ్లెటిక్ క్రీడా వేసవి శిబిరంలో పాల్గొన్న నలుగురు అత్యుత్తమ ప్రదర్శన కనబరచగా ఆరు పతకాలు వరించాయి. 60 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెం విభాగాల్లో పాల్గొన్న రిత్విక (రెండు వెండి పతకం), 60 మీటర్లు, బాల్‌త్రో విభాగాల్లో పాల్గొన్న సంజనకు (రెండు వెండి పతకాలు), షాట్‌పుట్ విభాగంలో పాల్గొన్న హర్షిక (కాంస్యం పతకం), 60మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న నాశ్విక్ (కాంస్యం పతకం) పతకాలు సాధించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్ కోచ్ రియాజ్ పాషా మాట్లాడుతూ... వేసవి శిక్షణ శిబిరానికి తల్లిదండ్రులు, సంరక్షకులు తమ పిల్లలను పంపించడం వల్ల వారిలో ఆరోగ్యంతోపాటు చలాకీగా ఉంటూ ఏకాగ్రత మెరుగుపడుతుందన్నారు. బాల, బాలికలలో ఉన్నటువంటి ప్రతిభను గుర్తించి సరైన రీతిలో శిక్షణను అందించడం వల్ల రాబోయే రోజుల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు వరిస్తాయని దీమా వ్యక్తం చేశాడు. వేసవి క్రీడా శిబిరాలను వేదికగా చేసుకొని ప్రతిభను కనబరిచిన పతకాలు సాధించిన క్రీడాకారులను డీవైఎస్‌వో పరందామరెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ యుగంధర్‌రెడ్డి, సీనియర్ కోచ్ మల్లికార్జున్ ప్రత్యేకంగా అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ రియాజ్ పాషా

లబ్ధిదారులకు వ్యాపార

నైపుణ్యాలపై సంపూర్ణ శిక్షణ

- 2న యువ వికాసం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ
- రాజీవ్ యువ వికాసం అమలుపై డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్

ఖమ్మం కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకం కింద లాభసాటి వ్యాపార యూనిట్లు గ్రౌండింగ్ జరిగేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం రాజీవ్ యువ వికాసం అమలుపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక, లాభదాయకమైన స్వయం ఉపాధి యూనిట్ ఎంపిక, నైపుణ్య శిక్షణ అందించడం, యూనిట్ గ్రౌండింగ్ తర్వాత పర్యవేక్షణ వంటి పలు అంశాలపై డిప్యూటీ సీఎం చర్చించి పలు సూచనలు చేశారు. యువ వికాసం పథకం కింద వచ్చే సహాయంతో యువత వ్యాపారం చేసి లబ్ధి పొందాలని, యువతను వ్యాపార వేత్తలుగా మార్చేలా ప్రభుత్వం పెట్టే ప్రతి పైసా పెట్టుబడి ఎలా పనిచేస్తుందో పర్యవేక్షించాలన్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జూన్ 2న ఎంపిక చేసిన లబ్ధిదారులకు రాజీవ్ యువ వికాసం ఉపాధి యూనిట్ మంజూరు పత్రాలను అందజేయాలన్నారు. జూన్ 2న మంజూరు చేసే లబ్ధిదారులలో అన్ని వర్గాలకు చెందిన వారు ఉండేలా చూడాలని, జూన్ నుంచి ప్రతి నెలా యువ వికాసం యూనిట్ గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారీగా లబ్ధిదారులకు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయడానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్ బాబు, మైనార్టీ సంక్షేమ అధికారి పురంధర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర అవతరణ' ఏర్పాట్లు బాగుండాలి

వేడుకల ఏర్పాట్లపై ఖమ్మం అదనపు కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ ఏర్పాట్లపై డీఆర్వో పద్మశ్రీతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ స్టాల్స్ ఏర్పాటుకు సిద్ధం చేయాలన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసే స్టాల్‌లో ఇందిరా డెయిరీ వివరాలను తెలియజేయాలన్నారు. సంక్షేమశాఖ పరిధిలో ఏర్పాటు చేసే స్టాల్‌లో ఇందిరా సౌర గిరి జల వికాసం, రాజీవ్ యువవికాసం పథకాలను వివరించాలన్నారు. జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరుకావాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సంబంధించి ఫ్లాగ్ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేసే కార్యక్రమాలను పోలీస్ , రెవెన్యూశాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. 25 నిమిషాలు పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేలా చూడాలని అన్నారు. వానాకాలం దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలో డ్రెయిన్లను క్లియర్ చేయాలని, ప్రజలకు ఫిర్యాదుల నమోదు కోసం కంట్రోల్ రూమ్ నెంబర్ ఏర్పాటు చేయాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ షఫీ ఉల్లాను అదనపు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అధికారులు, పోలీసు, కలెక్టరేట్ ఏవో అరుణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా

ముందడుగేయాలి



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

(5వ పేజీ తరువాయి)

ప్రోత్సహిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.30లక్షల వ్యయంతో ఖమ్మం నగరం వైరారోడ్డులో ఏర్పాటుచేసిన మహిళ మార్టును కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఆయన బుధవారం డ్వాక్రా మహిళతోప్రారంభింపచేశారు. అక్కడి స్టాళ్లలో ఉన్న వివిధ ఉత్పత్తులను పరిశీలించిన తుమ్మల అక్కడ జరిగిన సమావేశంలో డ్వాక్రామహిళలనుద్దేశించి ప్రసంగించారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఇందుకు తగిన విధంగా మహిళలు సంఘాల ద్వారా ఉత్పత్తులు పెంచి లాభాలు గడించి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. డ్వాక్రామహిళల కోసం రాష్ట్రంలో తొలిసారిగా ఖమ్మంలో మహిళ మార్టు ఏర్పాటుచేయడం గర్వకారణమన్నారు. ఇతర మునిసిపల్ పట్టణాల్లోనూ ఇలాంటి మార్టులు ఏర్పాటుచేసి మహిళ సంఘాల ఆదాయం పెంచేలా చూసుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ శిల్పారామంలో మహిళ సంఘాల ఉత్పత్తులు అమ్ముకునేలా అవకాశం కలిపించారని.. అదే తరహాలో అన్ని జిల్లా, పట్టణాల్లో మహిళలు అన్నిరకాల ఉత్పత్తులు తయారుచేసి అమ్ముకుని లాభపడాలని, ఇందులో దళారులకు అవకాశం ఇవ్వద్దన్నారు. ఇక మహిళలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి.. దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేసేలా కష్టపడి ఉన్నతంగా తీర్చిదిద్దడం ద్వారా కుటుంబాలు అభివృద్ధి సాధిస్తాయని, పేదరికం తొలిగిపోతుందన్నారు. గతంలో మహిళలు లక్షాధికారులు కావాలన్న నినాదం ఉండేదని, ఇప్పుడిక కోటీశ్వరులు కావాలన్నదే నినాదమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీఆర్‌డీవో సన్యాసయ్య, ఆర్డీవో నరసింహారావు, మార్కెట్ కమిటీచైర్మన్ యరగర్ల హనుమంతరావు, కార్పొరేటర్ కమర్తపు మురళి, మెప్మా డీఎంసీ ఎస్. సుజాతరాణి, టీఎంసీ జి.సుజాతరాణి, సీవోలు రోజా, ఉపేంద్ర, ద్రౌపది తదితరులు పాల్గొన్నారు.



మహిళామార్టును ప్రారంభిస్తున్న డ్వాక్రా మహిళ

మదన్‌లాల్ అంత్యక్రియలు పూర్తి

రఘునాథపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి): వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ఆకస్మిక మరణం తీరని లోటువంటిదని నిత్యం ప్రజలతో కలిసి మేలిసి మదన్‌లాల్ పనిచేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో బానత్ మదన్‌లాల్ నివాసం వద్దకు వెళ్లి మదన్‌లాల్ భౌతికకాయంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలదండ వేసి నివాళులు అర్పించారు. ప్రజా సమస్యలపై నిబద్ధతతో పనిచేసే మదన్‌లాల్ మరణంతో వైరా నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాలు మంచి నాయకుడ్ని కోల్పోయరన్నారు. మదన్‌లాల్‌తో తనకు ఉన్న సంబంధాలను గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా వారం రోజుల క్రితమే తనను కలిశారన్నారు. చాల సేపు తనతో మాట్లాడారన్నారు. హైదరాబాద్ హాస్పటల్‌కు వెళ్లి ఆరోగ్య మదన్‌లాల్ పరిస్థితి తెలుసుకుందమనుకున్నా ఈలోపుగా మదన్‌లాల్ మరణించారని విషయం తెలుసుకొని చాలా బాధపడ్డానన్నారు. కుటుంబ సభ్యులను మంత్రి తుమ్మల ఓదార్చారు. ఇల్లెందు, వైరా ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోత్ రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మార్కెఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కొణిజర్ల మాజీ సర్పంచి సూరంపల్లి రామారావు, వీవీ పాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు నివాళులు అర్పించారు. రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజ రవిచంద్ర, లు బానోత్ మదన్‌లాల్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. పువ్వాడ అజయ్‌కుమార్, వద్దిరాజు రవిచంద్ర మదన్‌లాల్ పాడే మోశారు. మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, సండ్ర వెంకటవీరయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరూనాయక్, గుత్తా రవి, మెంటం రామారావు, పిన్ని కోటేశ్వరరావు, హరిప్రసాద్, ప్రదీప్, బోడా భాస్కర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

అంగన్‌వాడీ భవనాలను వేగంగా పూర్తిచేయాలి

(5వ పేజీ తరువాయి)

మిషన్‌భగీరథ సమస్యలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. నియోజకవర్గాల వారీగా మిషన్‌భగీరథ ద్వారా చేపట్టిన పనుల వివరాల నివేదికలను అందించాలన్నారు. భగీరథ పనులు సమన్వయం కోసం ప్రతీ నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. ఈ సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, కొత్తగూడెం, అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం, ఇల్లెందు, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, కోరం కనకయ్య, మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి మాట్లాడుతూ తమతమ నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలు, పౌష్టికాహారం, సిబ్బంది కొరత, భవన నిర్మాణాలు, మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలను సీతక్కకు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ, మహిళ శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారులు, ఇరు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



సమీక్షకు హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు

సాగుకు సై..

(5వ పేజీ తరువాయి)

అవసరం ఉందని వ్యవసాయశాఖ గుర్తించింది. మొక్కజొన్న 3,453 ఎకరాల సాగుకు లక్ష్యం పెట్టుకున్నారు. 863 క్వింటాళ్ల విత్తనాలు, పత్తి 2,14,490 ఎకరాలు సాగుకుగాను 4,29,381 విత్తనాల ప్యాకెట్లు, వేరుశనగ 950 ఎకరాలకుగాను 950 క్వింటాళ్ల విత్తనాలు, అలాగే పెసర 165 ఎకరాలు, పిల్లిపెసర 1,952 ఎకరాలు, కంది 652 ఎకరాలు, మిర్చి 53,442 ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే రైతులు ఇప్పుడిప్పుడు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ఇక ఖమ్మంలోని ఎరువుల ర్యాక్‌ను ఖమ్మం రైల్వేస్టేషన్ నుంచి పందిళ్లపల్లికి మార్పుచేయడంతో అక్కడ అన్ని వసతుల కల్పనకు కొంత జాప్యం జరిగింది. ఇంకా జిల్లాకు సరిపడా ఎరువులు రాలేదు.

● భద్రాద్రి జిల్లాలో 6,31,124 ఎకరాల్లో పంటల సాగు ప్రణాళిక జరగ్గా.. వరి 1,60,956ఎకరాలు సాగులక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు 41,489 క్వింటాళ్ల విత్తనాలు, మొక్కజొన్న 86,544 ఎకరాలకుగాను 6,924 క్వింటాళ్ల విత్తనాలు, పత్తి 2,04,632 ఎకరాల్లో సాగు కాగా 4,09,254 ప్యాకెట్లును సిద్ధం చేశారు. వేరుశనగ 2791 ఎకరాలకు గాను 1,675 క్వింటాల విత్తనాలు, మినుము 857 ఎకరాలకుగాను 69 క్వింటాళ్ళ, పెసర 131 ఎకరాలకుగాను 10 క్వింటాళ్ల విత్తనాలు, కంది 1,159 ఎకరాలకు గాను 46 క్వింటాళ్ల విత్తనాలు, మిర్చి 10,449 ఎకరాలకుగాను 10క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేశారు. వ్యవసాయ శాఖ ముందుగానే విత్తనాలు సిద్ధం చేయడంతో రైతులు డిమాండ్ ఉన్న విత్తనాల కొనుగోలుకు సిద్ధమవుతున్నారు ఉమ్మడిజిల్లాలో అక్కడక్కడ విత్తనాలు నాటే కార్యక్రమం కూడా రైతులు చేట్టారు. గురువారం నుంచి పత్తి, మొక్కజొన్న, పెసర విత్తనాలు విత్తేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఖమ్మం జిల్లాలో 44.4.మీ.మీ సగటు వర్షపాతం నమోదు

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 44.4 మీ.మీ వర్షపాతం నమోదవగా అత్యధికంగా వైరాలో 106.2 మి.మీ., కొణిజర్లలో 88.4 మి.మీ, రఘునాథపాలెం 86.2 మి.మీ, ఖమ్మం రూరల్‌లో 67.4 మి.మీ., బోనకల్‌లో 66.2, నేలకొండపల్లి 69.4, తిరుమలాయపాలెంలో 57.4 మి.మీ., వర్షపాతం నమోదైంది. అయితే ఈ వర్షంతో అక్కడక్కడ మామిడితోటలకు స్వల్ప నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. అలాగే జిల్లాలోని పలు చెరువులకు స్వల్పంగా నీరు చేరగా.. చింతకాని మండలం నేరడలోని గచ్చుబంధం చెరువు అలుగుపారింది. అలాగే భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలోనూ విస్తారంగా వర్షం పడింది.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి
- ముదిగొండ మండలం ఎడవల్లిలో పర్యటన

ముదిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తమ ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం ఎడవల్లిలో రూ.4.75కోట్లతో నిర్మించ తలపెట్టిన యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు బుధవారం ఆయన తన సతీమణి నందినితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్థులు గజమాలతో సత్కరించి భారీ ర్యాలీ నిర్వహించారు. శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజలంతా ఆనందంగా ఉండాలని ప్రజాప్రభుత్వం మంచి పాలన అందిస్తోందని, అందుకే ఆ భగవంతుడు ఆశీర్వదిస్తున్నాడన్నారు. దశాబ్దాలుగా లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ఈ ప్రాంత ప్రజలకు ఆరాధ్య దైవంగా ఉందని, ప్రతిసారీ తన ఎన్నికల ప్రచారాన్ని ఈ ఆలయంలో పూజల అనంతరమే మొదలుపెట్టడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భగవంతుడి ఆశీర్వాదం ఉండటం వల్లనే ప్రజలంతా ఓటు వేసి గెలిపించటం వల్ల తాను ఈ స్థాయిలో ఉన్నానన్నారు. సమాజంలో ఉన్న అన్నివర్గాల ప్రజల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుందన్నారు. రాష్ట్రంలో పేదలకు 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.22వేల కోట్లు కేటాయించిందన్నారు. గ్యాస్, 200యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు లాంటి పథకాలను పేదల కోసం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో రూ.లక్షకోట్లు, సంవత్సరానికి రూ.20 వేల కోట్ల చొప్పున మహిళలకు వడ్డీలేని రుణాలను ఇచ్చితీరుతామన్నారు. అన్నదాతల కోసం రైతుభరోసా, రుణమాఫీ, ఆత్మీయ భరోసా పథకాలను తమ ప్రభుత్వం అందిస్తోందని, ఇందిరా గిరి ఆవాసయోజన పథకం కింద రూ.12600 కోట్లు కేటాయించి గిరిజనుల వ్యవసాయానికి సౌర పలకలను అందిస్తున్నామని వివరించారు. ఇక భగవంతుడు ఆశీర్వాదంతోనే ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వచ్చి వర్షాలు కురుస్తున్నాయన్నారు. సంపదను సృష్టించి, ఆ సంపదను ప్రజలకు పంచటానికి ప్రజాప్రభుత్వం కొత్త పథకాలను తెస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా రేషన్‌దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం లేదని, కేవలం తెలంగాణలో మాత్రమే పేదలకు సన్నబియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ ముదిగొండ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, సొసైటీల చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, సామినేని వెంకటేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, నాయకులు కందిమళ్ల వీరబాబు, రాంబాబు పాల్గొన్నారు.



ఆలయ పునర్నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న భట్టి

ఘనంగా గ్రానైట్ టైల్స్ ఓనర్స్ అసోసియేషన్
ప్రమాణ స్వీకారోత్సవం

- సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం
- గ్రానైట్ స్లాబ్ పరిశ్రమల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యుగంధర్, గోపాలరావు



ధ్రువీకరణ పత్రాలు స్వీకరిస్తున్న అధ్యక్షుడు తెడ్డు రమేష్, ప్రధాన కార్యదర్శి మోతుకూరి రామభద్రయ్య, కోశాధికారి చాగంటి శ్రీకాంత్

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 28(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే గ్రానైట్ పరిశ్రమల సమస్యల పరిష్కారం జరుగుతుందని, చిన్న పరిశ్రమ, పెద్ద పరిశ్రమ అనే తేడాలు లేకుండా అందరం కలిసికట్టుగా ఉన్నప్పుడు సమస్యలు పరిష్కరించుకోవచ్చునని గ్రానైట్ స్లాబ్ పరిశ్రమల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాటిబండ్ల యుగంధర్, కమర్తపు గోపాలరావు అన్నారు. బుధవారం ది ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ టైల్స్ యజమానుల సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం నగరంలోని అంకమ్మ తల్లి గుడి వద్ద గల టైల్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నూతన సభ్యులతో ఎన్నికల అధికారి బుగ్గవీటి శ్రీధర్ ప్రమాణస్వీకారం చేయించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 2025-27 సంవత్సరం వరకు ఈ నూతన కమిటీ బాధ్యతలలో ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్లాబ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు ఉపాధ్యక్షులు తమ్మినేని సాగర్, 4వ డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం ప్రమాణస్వీకారం చేసిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి తెడ్డు రమేష్, మోతుకూరి రాంభద్రయ్య, చాగంటి శ్రీకాంత్ మాట్లాడారు. తమపై నమ్మకంతో గ్రానైట్ టైల్స్ పరిశ్రమ యజమానులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధి తోడ్పాటుకు కృషి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ముందుగా గత కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సంఘం సంయుక్త కార్యదర్శి పోలూరి కృష్ణ, సంయుక్త కార్యదర్శి చాగంటి సందీప్, ఈసీ మెంబర్ సీతారామయ్య, టైల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పొట్లూరి శ్రీనివాస్, మాజీ గౌరవ అధ్యక్షుడు వడ్డె రాంబాబు, పరిశ్రమ యజమానులు పుసులూరి గిరిప్రసాద్, నల్లమోతు రామకృష్ణ, మిట్టపల్లి నాగేశ్వరరావు, ముక్కల పరిశ్రమల యజమానులు సూరంశెట్టి నరసింహారావు, దామల్ల పాపారావు, గాదె రాంబాబు, చావా కొండలరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు.

ప్రమాణస్వీకారం చేసిన సభ్యులు...

అధ్యక్షుడిగా తెడ్డు రమేష్, ఉపాధ్యక్షుడిగా(1)గా బోయిడి వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా(2)గా బోరెం నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోతుకూరి రామ భద్రయ్య, సంయుక్త కార్యదర్శి(1)గా పోలూరి కృష్ణ, సంయుక్త కార్యదర్శి(2)గా చాగంటి సందీప్, కోశాధికారిగా చాగంటి శ్రీకాంత్, ఈసీ మెంబర్‌గా వీరెల్లి సీతారామయ్యతో ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు.

తెలుగు వారి ఆరాధ్య నేత ఎన్టీఆర్

- 102వ జయంతి సందర్భంగా పలువురు నేతల నివాళి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న తుమ్మల యుగంధర్, విజయబాబు తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం, మే28 (ఆంధ్రజ్యోతి): 'తెలుగుప్రజలను రాజకీయ చైతన్యం తీసుకొచ్చి బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడిన అన్న నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయునిగా నిలిచారని... తెలుగువారి ఆరాధ్యనేత ఎన్టీఆర్ అని తెలుగుదేశం పార్టీ నాయకులు కొండబాల కరుణాకర్, మందడపు సుధాకర్, మల్లెంపాటి అప్పారావు అన్నారు. బుధవారం ఎన్టీఆర్ కార్యాలయం లో అన్న నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన తెలుగుప్రజలు, బడుగుబలహీన వర్గాల ఉద్ధరణ కోసం ఎన్టీరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి 13నెలల్లో అధికారంలోకి వచ్చి చారిత్రాత్మకంగా నిలిచారన్నారు. ప్రభుత్వ పరిపాలనను ప్రజల ముంగిటికి తీసుకొచ్చి ఎన్నో సంస్కరణలను అమలుపరిచిన నేతగా అభివర్ణించారు.కిలోరెండు రూపాయలకు బియ్యం, పటేల్‌పట్వారీ వ్యవస్థ రద్దు మండలాల ఏర్పాటు, బడుగులకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించి సంస్కరణలను చేపట్టి తెలుగువారి గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. ఆయన రూపొందించి అమలు చేసిన సంక్షేమ పథకాలే నేటి పాలకులు పేర్లుమార్చి అమలుచేస్తున్నారని అన్నారు. వెండితెరపై కూడా ఎన్నో విలక్షణ పాత్రలు ధరించి సమాజానికి మంచి సందేశాత్మక చిత్రాలు అందించి తెలుగుప్రజల గుండెల్లో అన్న ఎన్టీఆర్ నిలిచారాన్నారు. ఆయన స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌లోనూ తెలంగాణ రాష్ట్రాల్లోనూ అజేయంగా నిలుస్తుందని అన్నారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లోని అన్న నందమూరి విగ్రహానికి నివాళులు అర్పించారు. పార్టీ కార్యాలయంలో మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి వెంకటేశ్వరరావు, మందడపు సుధాకర్, వనమా వాసు, నాగార్జున శ్రీనివాస్, బోయిన వెంకన్న, రాయల కోటేశ్వరరావు, మందపల్లి కోటేశ్వరరావు, పాలడుగు క్రిష్ణ ప్రసాద్, కొలికొండ మురళి, నల్లమాస మల్లయ్య, మల్లెంపాటి లహరిన్ , కర్నాటి అశ్వనీకుమార్, రాజ రాజేశ్వరి, కామ అనిత, చావా రామారావు, సామినేని లక్ష్మణ్ రావు, వాసిరెడ్డి భాస్కర్ రావు, చల్లంగుడ్ల రమేష్, మేకల సత్యవతి, తాడిశెట్టి స్వాతి, జాన్సీ, తిగుళ్ల రమణ, నల్లమోతు సత్యనారాయణ, అబ్దుల్ మజీద్, మంద వెంకటేశ్వర్లు, ఓర్సు కృష్ణ, జైరాం, లింగయ్య, పొదిల భూపతి, బుడిగే శ్రీను పాల్గొన్నారు.



ఆర్టీసీ నియామకాల పేరుతో తప్పుడు ప్రకటనలు

- ఆర్టీసీ ఆర్ఎం సరిరాం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ ఆర్టీసీ) ఖమ్మం రీజినల్ పరిధిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్లను నియమించటంలేదని, అలాంటి తప్పుడు ప్రకటనలను నమ్మవద్దని రీజనల్ మేనేజర్ సరిరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ కల్పన పేరుతో సంస్థ ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదని తెలిపారు. ఆర్టీసీ సంస్థ పేరిట తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

లాహిరి లాహిరి 'రోహిణి'లో..

- మండు వేసవిలో చల్లబడిన వాతావరణం
- రోళ్లు పగలాల్సిన కాలంలో జల్లులు
- వర్షాలకు అలుగులు పోస్తున్న చెరువులు

చింతకాని/ వైరా/ ఖమ్మం సాంస్కృతికం, మే 28(ఆంధ్రజ్యోతి): రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయని పెద్దలు అంటుంటారు. మే నెలలో 40 నుంచి 45 సెల్సియస్ డిగ్రీలుగా నమోదయ్యే ఉష్ణోగ్రతల వలన వేసవి తాపంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రారు. కానీ ఎన్నడూ లేని విధంగా మే నెల రోహిణి కార్తెలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు తడసి ముద్దవుతున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో ఈ ఏడాది 20 రోజులు ముందుగానే రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. దీంతో భారీ వర్షాలు కురుస్తుండటంతో మండు వేసవిలో వాతావరణం చల్లబడింది. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువుల్లోకి వరద నీరు చేరుతోంది. మంగళవారం రాత్రి చింతకాని మండల వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో పలు గ్రామాల్లోని చెరువులు అలుగులు పోస్తున్నాయి. నేరడ, బస్వాపురం, మత్కేపల్లి, కొదుమూరు, నాగిలిగొండ గ్రామాల్లోని చెరువులలోకి భారీగా వర్షపు నీరు చేరడంతో నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. మే నెలలోనే భారీగా వర్షాలు కురిసి చెరువులు నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పెరిగిన వైరా రిజర్వాయర్ నీటిమట్టం

రోళ్లు పగిలే ఎండలు ఉండే తరుణంలో మంగళవారం రాత్రి వైరాలో దాదాపు నాలుగు గంటలసేపు కుండపోతగా భారీ వర్షం కురిసింది. రాత్రి 7నుంచి 11గంటల వరకు ఎడతెరపి లేకుండా వర్షం పడింది. రోహిణికార్తెలో రికార్డు స్థాయిలో 106.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షపునీరు రోడ్లపైనుంచి వరదలాగా ప్రవహించింది. ఈ భారీ వర్షానికి వైరా రిజర్వాయర్ నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. ఏడు అంగుళాల నీరు రిజర్వాయర్‌కు వచ్చి చేరింది. దాంతో బుధవారానికి రిజర్వాయర్ నీటిమట్టం 14.8అడుగులకు పెరిగింది.

జిల్లాలో 44.4 మిల్లీమీటర్ల వర్షం

జిల్లాలో మంగళవారం రాత్రి సరాసరి 44.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. సాయంత్రం ఆరు గంటల నుంచి మొదలై అర్ధరాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. కొన్ని మండలాల్లో భారీ వర్షం కురవగా మరికొన్ని మండలాల్లో ఒక మోస్తరు వాన పడింది. అత్యధికంగా వైరాలో 106.2 మిల్లీమీటర్లు, కొణిజర్లలో 88.4 , రఘునాధపాలెం మండలంలో 86.2 , నేలకొండపల్లిలో 69.4, ఖమ్మం రూరల్‌లో 67.4, బోనకల్ మండలంలో 66.2, తిరుమలాయపాలెం 57.4, చింతకాని లో 57.2, మధిరలో 56.4, ఎర్రుపాలెంలో 43.6, ముదిగొండలో 40.2, ఖమ్మం అర్బన్‌లో 36.8, ఏన్కూరులో 32.6 మిల్లీమీటర్లు నమోదయ్యింది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి వర్షం కురిసింది.

మేలో అలుగులు పోయడం చూడలేదు

షేక్ దర్గయ్య లచ్చగూడెం



మే నెలలో ఎండ వేడిమికి తట్టుకోలేక చెట్ల కింద సేద తీరేవాళ్లం. ఎప్పుడైనా మే నెలలో తుఫాన్లు ఏర్పడితే ఐదారు రోజులు చల్లదనం ఉండేది తప్ప ఇంతలా ఎప్పుడూలేదు. రోహిణి కార్తెలో భారీ వర్షాలు కురిసి చెరువులు అలుగులు పోయడాన్ని నేను పుట్టిన తరువాత చూడలేదు.

ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రఘునాథపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే పంటలను సాగు చేయటం ద్వారా రైతులు నష్టాల భారీ నుంచి బయటపడతారని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బుధవారం రఘునాథపాలెం మండల బల్లేపల్లిలో ఆయిల్‌పామ్ రైతులతో మాట్లాడారు. అయిల్‌పామ్ సాగు చేయటం ద్వారా లాభాలను వివరించారు. పంటల మార్పిడి విధానాలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా అయిల్‌పామ్ రైతులతో కలెక్టర్ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

దివ్యాంగ మహిళలకు జీరాక్స్ కేంద్రాలు

మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఎదగటం ద్వారా కుటుంబ వ్యవస్థ చైతన్యవంతంగా మారుతుందని, దివ్యాంగులైన మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద జీరాక్స్ కేంద్రాలను మంజూరు చేస్తున్నామని వారిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బుధవారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా 'షీ జీరాక్స్' కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రద్దీ అధికంగా ఉంటుందని, దివ్యాంగులకు మెరుగైన వ్యాపారం అందించేందుకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, అధికారులు పాల్గొన్నారు

రూ.4.15కోట్ల గంజాయి పట్టివేత

- 8.30క్వింటాల సరుకు, మినీకంటెయినర్ సీజ్
- 9మందిపై కేసు నమోదు.. ఇద్దరి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

జూలూరుపాడు, మే 28(ఆంధ్రజ్యోతి): అక్రమంగా వాహనంలో భారీగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో చోటుచేసుకుంది. బుధవారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజ్ కేసు వివరాలను వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బెండ్‌జిల్లా బాసవైకపుర హతర్‌కరి గ్రామానికి చెందిన జస్రం, బరై గ్రామానికి చెందిన రాంకుమార్(అలియాస్ రాంకుమార్ అజారయ్యా) అనే ఇద్దరు లారీ డ్రైవర్లు మిని కంటైనర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో తులసిపాక గ్రామంలో గంజాయిని తరలించేందుకు వాహనంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్యాబిన్(బాక్స్)లో 8.30 క్వింటాల గంజాయిని భద్రాచలం, కొత్తగూడెం మీదుగా ఖమ్మం నుంచి ఢీల్లీకి తరలిస్తున్నారు. మంగళవారం జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా మండలంలోని పడమటనర్సాపురం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టుబడింది. గంజాయిని స్వాధీనం చేసుకుని మిని కంటైనర్, రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం మొరేనా జిల్లా శంకర్‌పుర గ్రామానికి చెందిన ప్రదీప్ రామ్‌సేవక్, ఢిల్లీకి చెందిన దీపక్ చౌదరిలు కలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని రామవరం మండలం నావగూడెం గ్రామానికి చెందిన కిలో శంకర్, కిలో సాయిబాబు, చింతూరు జిల్లాకు చెందిన వంతల బాబురావు, రామారావు, రాములు వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి వాహనంలో ఢిల్లీకి రవాణా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.4.15కోట్లు చేస్తుందని తెలిపారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ బాదావత్ రవి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామాకాంత్, ఎస్సై ప్రవీణ్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, సీసీఎస్ ఎస్ఐ జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి ఎస్ఐలు ప్రవీణ్, బాదావత్ రవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- నిందితుడి నుంచి 162 గ్రాముల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రవీందర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వరరావు

మణుగూరు, 28 మే (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని శ్రీవారి జ్యూయలరీస్ నగల దుకాణంలో కస్టమర్‌లా వచ్చి నగలు దోచుకెళ్లిన దొంగను మణుగూరు పోలీసులు పట్టుకున్నారు. మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి బుధవారం దొంగతనం కేసు వివరాలను వెల్లడించారు. మణుగూరు పట్టణంలోని శ్రీవారి జ్యూయలరీ షాపులో దొంగతనం జరిగిన విషయమై ఈ నెల 23 శుక్రవారం షాపు యజమాని దేవతా శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దుకాణంలోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి, నిందితుడి ఊహాచిత్రాలను రూపొందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తులో భాగంగా మంగళవారం హనుమాన్ టెంపుల్ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు వెంబడించి, అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో తాను దొంగతనానికి పాల్పడిన విషయం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుని వద్ద మొత్తం 162 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో 132 గ్రాములు మణుగూరు పట్టణంలోని నగల దుకాణంలో దొంగిలించినవి కాగా, మరో 30 గ్రాములు వరంగల్ జిల్లా సాయిగణేష్ జ్యూయలరీ షాపులో దొంగతనం చేసినవిగా దొంగతనానికి పాల్పడిన నిందితుడు గొర్రెల సత్యనారాయణ పోలీసుల ఎదుట ఒప్పుకున్నాడు. విచారణలో నిందితుడు గొర్రెల సత్యనారాయణది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, భీమవరం జిల్లా ఆకివీడుకు చెందిన వాడిగా గుర్తించామన్నారు. నిందితుడిని రిమాండ్ చేసినట్లు తెలిపారు. దొంగతనం కేసును నాలుగు రోజుల్లోనే ఛేదించిన ఏడూళ్లబయ్యారం సీఐ వీ వెంకటేశ్వరరావు, ఎస్ఐ మేడా ప్రసాద్, సీసీఎస్ ఎస్ఐ రామారావు, సిబ్బంది బాలు, వెంకటనారాయణ, విజయ్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో భార్య మృతి చెందగా మనోవేదనతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో బుధవారం జరిగింది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన పద్దం కృష్ణారావు(49)భార్య విజయ ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆనాటి నుంచి మనోవేదనతో మద్యానికి అలవాటు పడ్డాడు. ఇదే తరుణంలో మంగళవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు వివరించారు.

అనారోగ్యంతో బాధపడుతూ ఒకరు..

కామేపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కామేపల్లి మండల పరిధిలోని గోవింద్రాల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవింద్రాల గ్రామానికి చెందిన భూక్య బాలకృష్ణ(40) గత రెండేళ్లగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యం భరించలేక ఈనెల 27న ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

అశ్వాపురం, మే 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఇల్లటూరి మహేష్ బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి పోగొట్టుకున్న పర్సును తిరిగిఇచ్చి మానవత్వం చాటుకున్నాడు. మహేష్ మణుగూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం డ్యూటీపై అమలాపురం వెళ్లి తిరిగి మణుగూరు వస్తుండగా, అశ్వారావుపేటకు చెందిన ప్యాసింజర్ రూ.లక్ష నగదు ఉన్న పర్సును బస్సులో పోగొట్టుకున్నాడు. పర్సు పోగొట్టుకున్న విషయాన్ని గమనించిన ప్రయాణికుడు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో మహేష్ బస్సులో తనిఖీ చేయగా రూ.లక్ష నగదు ఉన్నపర్సును గమనించిన మహేష్ మణుగూరు డిపో సెక్యూరిటీ అధికారులకు అప్పగించాడు. బుధవారం బాధిత ప్రయాణికుడికి డ్రైవర్ చేతుల మీదుగా బాధితుడికి నగదు అప్పగించారు. కాగా పోగొట్టుకున్న నగదును ప్రయాణికుడికి అందజేసిన మహేష్‌ను పలువురు అభినందించారు.

సైబర్ నేరస్థుడి రిమాండ్



నిందితుడితో సైబర్‌క్రైం పోలీసులు

ఖమ్మం, మే28(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ట్రేడింగ్, ఇన్వెస్టిమెంట్‌లో డబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పి రూ.1.62 కోట్లు మోసం చేసిన కేసులో ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు మరొకరిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు సీపీ సునీల్‌దత్ ఓ ప్రకటనలో తెలిపారు. బోనకల్లు మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి ఫోన్ చేసి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో నగదు కాజేసిన ఘటనలో సోమవారం విజయవాడలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన సైబర్ క్రైం పోలీసులు అదే కేసుకు సంబంధించి మరో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. కేసుతో సంబంధం ఉన్న నలువాల అర్జున్‌ను సిద్ధిపేట జిల్లాలో అరెస్ట్ చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరుపరిచి రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. కేసు విచారణలో ముఖ్యపాత్ర పోషించిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి రెండు నెలల జైలు

ఖమ్మం లీగల్, మే28 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన బాల నాగు సంతోష్‌కుమార్‌కి చెల్లని చెక్కుకేసులో రెండు నెలలు జైలుశిక్షతో పాటు రూ.2లక్షల 10వేల రూపాయలను నష్ట పరిహారం కింద చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన సముద్రాల శ్రీధర్ వద్ద సంతోష్‌కుమార్ 2017 లో రూ.లక్షా50వేలను అప్పుగా తీసుకున్నాడు. కాగా 2018లో రూ.2లక్షలకు చెక్కు ఇచ్చాడు. నిందితుని ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. చెల్లని చెక్కు కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సుజాతనగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం, కొత్తగూడెం ప్రధాన రహదారిపై నాయకులగూడెం గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. నాయకులగూడెం గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్(55) ద్విచక్ర వాహనంపై సుజాతనగర్ వస్తుండగా స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద కొత్తగూడెం వైపు నుంచి వస్తున్న జూలూరుపాడుకు చెందిన పూనెం బాలకృష్ణకు చెందిన మరో ద్విచక్రవాహనం ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్ల అరెస్టు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ నివాసంలో జూదం ఆడుతున్న ఎనిమిది మంది ట్రాన్స్‌జెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని శ్రీనివాసనగర్‌లో ఓ నివాసంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో మూడో పట్టణ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. వారి వద్ద నుంచి రూ.1.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

30క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

అశ్వాపురం, మే28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 30క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని బుధవారం అశ్వాపురం పోలీసులు పట్టుకున్నారు. బూర్గంపాడు నుంచి అశ్వాపురానికి రేషన్‌బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నిఘాఏర్పాటు చేశారు. మండల పరిధిలోని సీతారాంపురం వద్ద బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఈ దాడిలో వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, 30క్వింటాళ్ల బియ్యం స్వాధీనపర్చుకున్నారు. బియ్యం తరలిస్తున్న వ్యాను డ్రైవర్ లక్ష్మణ్‌రావు, మరోవ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

తిరుమలాయపాలెం, మే28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని నకిలీ విత్తనాలు అమ్మితే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని జేడీఏ పుల్లయ్యతెలిపారు. బుధవారం మండలంలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెం, తదితర గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన డీలర్ల ఓఫారాలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్కులు, స్టాక్‌బోర్డులు, నేమ్‌బోర్డులు చెక్‌చేశారు. విత్తనాలు కొనేటప్పుడు రైతులకు బిల్లు ఇవ్వాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కారయక్రమంలో ఏవో సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

తిరుమలాయపాలెం/ నేలకొండపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, అన్ని వసతులున్నాయని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ తెలిపారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో ప్రచారజాత నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శులు మన్నం నరసయ్య, షరీఫ్, కేశ్యా, రాంబాబు, రంగమ్మ, పాల్గొన్నారు.

దుకాణ యజమానిపై కేసు

ఖమ్మం ఖానాపురంహవేలి మే 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కస్పాబజార్‌లో నకిలీ పైపులు విక్రయిస్తున్న ఓ దుకాణ యజమానిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కస్పాబజార్‌లోని ఓ శానిటరీ, ఎలక్ట్రికల్స్ దుకాణంలో తనిఖీలు చేపట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఓ కంపెనీకి చెందిన నకిలీ పైపులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై ఖమ్మం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పీఎస్‌ఆర్ రోడ్డులోని దుకాణంలో తనిఖీలు జరిపి నకిలీ పైపులను గుర్తించారు. త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

‘అన్న’కు ఘన నివాళులు

» సందడిగా ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాలు

ఖమ్మం మామిళ్లగూడెం/ నేలకొండపల్లి, మే28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అన్న నందమూరి తారకరామారావుకు పార్టీలకు అతీతంగా నివాళులు అర్పించారు. బుధవారం 102వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్‌లోని అన్న విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు తదితరులున్నారు. ఎన్టీఆర్ కు తెలంగాణ ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డెం విజయ్ ఎన్టీఆర్ సర్కిల్‌లోని అన్న నందమూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. త్రీ టౌన్ ఏరియా కాల్వఒడ్డులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాతరాజు కనకయ్య, కందిబండ నరసరావు, కొడగంటి ఆంజనేయులు, ఓర్స్ కృష్ణ, జయరాం, కుసుమ రాము, పాల్గొన్నారు .నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్, గువ్వలగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. పార్టీ జెండాను ఎగురవేసారు. రాయగూడెం, మూటాపురం, ఆరెగూడెం, బోదులబండ, మంగ్రాజుపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. తెలుగు జాతికి, తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. తలశీల రాధాకృష్ణమూర్తి, అక్కినేని నాగేశ్వరరావు, వీసం శ్రీనివాసరావు, మద్దినేని మహేష్, తీగ వెంకటేశ్వర్లు, తిరపతిరావు, కోలేటి మస్తాన్‌రావు, కొర్లకుంట కిరణ్, గోగినేని సీతారాంబాబు, నలమాస మల్లయ్య, తాటికొండ నాగేశ్వరరావు, పావులూరి వెంకటేశ్వరరావు, నూతక్కి ప్రసాద్, పాలడుగు పూర్ణ, మాతంగి రమేష్, దుడ్డెల గోపాలరావు, కాసాని బడేమియా, కట్టా రాజేష్, కొణిదెల సుగుణ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వడ్డెం విజయ్



నివాళులర్పిస్తున్న అభిమాని



రాయగూడెంలో ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో టీడీపీ కార్యకర్తలు



కాకరవల్లిలో ఎన్టీఆర్ జయంతి దృశ్యం



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 28(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు జరుగుతాయని, ఇళ్ల స్థలాలు లేని నిరాశ్రయులకు ప్రభుత్వమే ఇళ్ల స్థలాలను చూపించి ఇళ్లు నిర్మాణం చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం 29వ డివిజన్‌లో రూ.60లక్షలతో నిర్మాణం జరగనున్న అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న మహిళలతో మంత్రి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలతో పాటుగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఖమ్మం నగరంలో మున్నేరు ముంపు నుంచి ప్రజల్ని రక్షించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటునామన్నారు. ఖమ్మం నగరాన్ని అందంగా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్ కొప్పెర సరిత, కాంగ్రెస్ నాయకులు కొప్పెర ఉపేందర్, గుడ్ల శ్రీనివాసరావు, వనపర్తి సాగర్, కొమ్ము నాగేశ్వరరావు, మొగిలి రమేశ్, నల్లమాస శ్రీను, బడేమియా, పాకా రాజ్యం, మల్లం నవీన్, రాందేవ్ సురేశ్, రమేశ్, పులకల వెంకన్న, వెంకట్, వెంకట్, రవి, పత్తికొండ శ్రీను, శంకర్, ముత్తయ్య పాల్గొన్నారు.

ఆడపిల్ల ఇంటికి మణిదీపం: సీడీపీవో

నేలకొండపల్లి, మే28 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు ఇంటికి మణిదీపాలని, ఆడ పిల్లలను తక్కువగా చూడవద్దని ఐసీడీఎస్ సీడీపీవో రత్నకుమారి అన్నారు. మూటాపురం అంగన్‌వాడీ కేంద్రం-1లో బుధవారం తొలి కాన్పులో ఆడపిల్లకు జన్మనిచ్చిన భూక్యా వరుణ్, దివ్య దంపతులను ఐసీడీఎస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ ఆడపిల్ల భారమనుకునే వారు ఇప్పటికీ సమాజంలో ఉండటం సిగ్గుచేటన్నారు. ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మి అన్నారు. మగ పిల్లలతో పాటుగా ఆడ పిల్లలను పెంచాలని, నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్న సంగతిని చూస్తూనే ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బెల్లం లక్ష్మీకుమారి, అంగన్‌వాడీలు లక్ష్మి, బాలామణి, పార్వతి ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామదీపికతో పాటుగా కార్యదర్శి స్వరూపారెడ్డి పాల్గొన్నారు.



ఆడ శిశువు తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రతిభావంతుడైన విద్యార్థికి ప్రోత్సాహకం

ఖమ్మం చర్చికాంపౌండ్, మే28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి టూవీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రోత్సాహకాలు అందించారు. ఈసందర్భంగా మెకానిక్ శెట్టి వెంకటేశ్వర్లు కుమారుడు లోకేష్ పదోతరగతిలో 510 మార్కులు సాధించగా ట్రాఫిక్ సీఐ సాంబశివరావు చేతులమీదుగా రూ.5వేల చెక్కును అందించారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లాఅధ్యక్షుడు వంగాల కొండలరావు మాట్లాడుతూ పదో తరగతిలో ప్రతిభచూపిన మెకానిక్‌ల పిల్లలకు నగదు ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ట్రాఫిక్ సీఐ సాంబశివరావును ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో తటుకునూరి బ్రహ్మాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్, బల్లి నాగేశ్వరరావు, దుంపల నాగరాజు పాల్గొన్నారు.



లోకేష్‌కు చెక్కు అందజేస్తున్న దృశ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తుమ్మల యుగంధర్

అలరించిన సంగీత విభావరి

ఖమ్మం సాంస్కృతికం, మే 28 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారకరామారావు 102వ జయంతి సందర్భంగా స్వరమాలిక కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన సంగీత విభావరి సంగీత ప్రియులను అలరించింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పుణ్యభూమి నాదేశం పేరుతో నిర్వహించిన ఈకార్యక్రమంలో ఎన్టీరామారావు నటించిన పాత చిత్రాల్లోని ఆపాత మధురాలను వీనులవిందుగా ఆలపించారు. పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖ కళాకారులతోపాటుస్థానిక గాయనీగాయకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాత చిత్రాల్లోని పాటలను పాడారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఎన్టీరామారావు సినీ కళారంగ ప్రతిభను కొనియాడారు. తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ ఎన్టీఆర్ తెలుగు వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోతారన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత పులిపాటి ప్రసాద్, నిర్వాహకులు ఇసనపల్లి నగేష్, మధుకుమార్, ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ఖమ్మంలోని వర్తక సంఘ భవనంలో స్వరమాధురి కల్చరల్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక సంగీత విభావరి జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సంగీతాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



క్యాష్ కౌంటర్ వద్ద కొనుగోలుదారుల రద్దీ



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎడ్లబండి బొమ్మను అందజేస్తున్న డీఎంసీ, టీఎంసీ

కిక్కిరిసిన మహిళా మార్ట్

» తొలి రోజు విశేష స్పందన » అకట్టుకున్న హ్యాండ్‌బ్యాగ్‌లు, బొమ్మలు

» బిజీ షెడ్యూల్‌లోనూ మహిళలతో మమేకమైన మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్ తొలి రోజు విశేషంగా ప్రజల్ని ఆకట్టుకొంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించిన వెంటనే నగర ప్రజలు మహిళా మార్టులోకి కిక్కిరిసే స్థాయిలో వెళ్లారు. చేతితో చేసిన హ్యాండ్‌బ్యాగ్‌లు, బొమ్మలు, ఆర్గానిక్ ఆయిల్స్ ఆహారపదార్థాలు, పిండి వంటలను విరివిగా కొనుగోలు చేశారు. కాగా మహిళా మార్టులో మహిళా ఉత్పత్తులతో పాటుగా కొన్ని ప్రముఖ కంపెనీల వస్తువులు, పదార్థాలు ఏర్పాటు చేయటంపై వాటిని పరిశీలించిన వారు పెదవి విరిచారు. ఖమ్మం నగరంలో బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యాటన చాలా బీజీగా సాగింది. అయినా మహిళా మార్టులో మహిళా స్వయం సహాయక సంఘాలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మమేకమై మాట్లాడారు. చేతి వృత్తులు ఏలా చేస్తున్నారని, నేరుగా అమ్మకాలు ఏలా జరుపుతున్నారని తెలుసుకున్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బ్యాగ్‌లు, జూట్ సంచులు, చీరలు, ఇతర వస్తువులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి మంత్రి తుమ్మలకు రైతు బండితో ఉన్న బొమ్మను అందించారు. ఎటువంటి వస్తువులు మహిళా మార్టులో విక్రయిస్తున్నారని డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్యను మంత్రి తుమ్మల అడిగి తెలుసుకున్నారు.



టీ తాగుతున్న మంత్రి తుమ్మల

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం, మే28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వివిధ కారణాలతో మరణించిన మృతుల కుటుంబాల సభ్యులకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10వేలు బుధవారం జిల్లా కాగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి అందించారు మండలంలో మేడిదపల్లి, హస్నాబాద్ తదితర గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన మృతుల కుటుబాలకు ఆర్థికసాయం అందించారు ఈసందర్భంగా ఆయను మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలనే లక్ష్యంతో మంత్రి పొంగులేటి మంచి కార్యక్రమం చేపట్టారన్నారు. నిరుపేదలకు ఏకష్టం వచ్చినా పొంగులేటి అండగా ఉండి ఆదుకుంటారన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి భరత్‌చంద్ర, బాలకృష్ణ, కె.వెంకటరెడ్డి, వీరన్న, శంకర్, ముదిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీను, ఉన్నం రాజశేఖర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో సమస్యలపై వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు


ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించండి

» సీపీఎం డివిజన్ కార్యదర్శి విక్రమ్

» సూపరింటెండెంట్‌కు వినతిపత్రం

ఖమ్మం కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ పేషెంట్ కు అత్యవసర సమయాల్లో సీనియర్ డాక్టర్లు అందుబాటులో లేకపోవడం వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జూనియర్ డాక్టర్లతో వైద్యం చేయడం వల్ల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్పిటల్‌లో క్యాజువలిటీలో డాక్టర్లు నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అంబులెన్స్‌లు కూడా ప్రభుత్వ ఆస్పత్రికి రాకుండా ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొని వెళ్లే వారిపై చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గుండెకు సంబందించిన విభాగంలో శాశ్వత ప్రాతిపదికన డాక్టర్ ను నియమించాలని, టిఫా స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభించాలన్నారు. హాస్పిటల్ మెయిన్ గేటు నుంచి మార్చురీ వరుకు రోడ్ వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలల నుంచి కాంట్రాక్టు కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే జూన్ నెలలో ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ నవీన్ రెడ్డి, వన్ టౌన్, టూ టౌన్ కార్యదర్శి ఎస్కే నాగులు మీరా, బోడపట్ల సుదర్శన్, నాయకులు జె వెంకన్న బాబు, అంబటిపూడి సుధాకర్, బద్రం, గుమ్మడి బిక్షం తదితరులు పాల్గొన్నారు

అ..ఆ..ల దోస్తుల ఆనంద హేల



సమ్మేళనానికి హాజరైన 1990-91 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని మారుతీ ట్యుటోరియల్స్‌లో 1990-91 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల కలయిక బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆనాటి గురువులు యోగానందం, మధార్, జైరాం, పట్టాభిరామారావులను విద్యార్థులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు పలకరించుకుంటూ రోజంతా గడిపారు. 35ఏళ్ల తర్వాత గురువులతో కలిసి వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, సిద్ధార్థ్, సునీత, అనిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.



కడపలో జరుగుతున్న మహానాడు రెండో రోజు కార్యక్రమంలో ఖమ్మం నుంచి పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మహానాడులో ఖమ్మం జిల్లా నేతలు కీలక బాధ్యతలను కూడా నిర్వహించారు. పార్లమెంట్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీష్, కూరపాటి వెంకటేశ్వర్లు, కూచిపూడి జై పాల్గొన్నారు.

- ఖమ్మం మామిళ్లగూడెం

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

నేలకొండపల్లి, మే28 (ఆంధ్రజ్యోతి): పేదలు, వ్యసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బోదులబండలో ఉపాధి హామీ కూలీలకు రామిరెడ్డి సమస్యలనువివరిస్తూ, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన అవసరాన్ని వివరించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయటానికి బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. వ్యవసాయ కూలీలకు పని దినాలను తగ్గించటంతో పాటుగా, రోజువారీ కూలీని కూడా తగ్గించారన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలును మరిచిందన్నారు. భూమి లేని నిరుపేదలకు రూ.12వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరుగనున్న ధర్నాను విజయవంతం చేయాలని రామిరెడ్డి పిలుపునిచ్చారు.

మదన్‌లాల్ మృతికి సంతాపం

ఖమ్మం చర్చికాంపౌండ్, మే28(ఆంధ్రజ్యోతి): వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ మృతిపట్ల లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు భద్రునాయక్ సంతాపం తెలిపారు. బుధవారం మదన్‌లాల్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 28(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో బాధితులకు తక్షణం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక ప్రయోజనం కలుగుతోందని కాంగ్రెస్ నాయకుడు పాలేపు వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం 44వ డివిజన్‌లో ఇద్దరు లబ్దిదారుల నివాసాలకు వెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



సత్తుపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ ఎన్టీ రామారావు జయంతిని సత్తుపల్లి, వైరా, మధిర నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు పార్టీల నాయకులు, అభిమానులు ఎన్టీ రామారావు జయంతిని నిర్వహించారు. సత్తుపల్లిలో ఎన్టీ రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలో తెలుగువారికి గుర్తింపు తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని తెలిపారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వైరాలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



కల్లూరులో...



ఏన్కూర్‌లో...



తల్లాడలో...

ముగిసిన మదన్‌లాల్ శకం..





ఎన్నికల ప్రచార సభలో కేసీఆర్‌తో మదన్‌లాల్(ఫైల్)

వైరా, మే 28 (ఆంధ్రజ్యోతి): వైరా అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని చాటుకున్న మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ మరణంతో ఆయన శకం ముగిసింది. ఆయన మరణంతో వైరా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర విషాదం అలుముకుంది. గడిచిన 18సంవత్సరాలుగా మదన్‌లాల్ వైరా నియోజకవర్గ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి భంగపాటుకు గురైన ఆయన రాజీ పడకుండా కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కేవలం 5,551 ఓట్లు మాత్రమే వచ్చినప్పటికీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన ఆయన ఆతర్వాత నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా నియోజకవర్గంపైనే ప్రత్యేక దృష్టిసారించారు. అన్ని గ్రామాలను కలియతిరిగారు. సామాన్య కార్యకర్తను సైతం పేరు పెట్టి పిలిచి తన వాడిగా వారి ఆదరాభిమానాలు దక్కించుకొని తనకంటూ ఒక వర్గాన్ని సృష్టించుకున్నారు.

2014లో వైసీపీ అభ్యర్థిగా గెలుపు..

దాని ఫలితమే 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం లభించింది. సీపీఎం మద్దతుతో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి అనూహ్యంగా విజయం సాధించారు. ఆతర్వాత కొద్దికాలానికే అధికార పార్టీ బీఆర్ఎస్‌లో చేరారు. 2014 ఎన్నికల్లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో గెలిచిన మదన్‌లాల్ ఆతర్వాత ఆయనతో విభేదించి బీఆర్ఎస్‌లో చేరారు. తర్వాత శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్‌లో చేరినప్పటికీ మదన్‌లాల్ ఆయనతో సయోధ్య కొనసాగించటానికి ఇష్టపడలేదు. తనదైన శైలిలోనే మదన్‌లాల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగారు. 2018 ఎన్నికల్లో మదన్‌లాల్‌కు టిక్కెట్ వ్యతిరేకిస్తూ శ్రీనివాసరెడ్డి వర్గం ప్రత్యక్ష ఆందోళనలు చేసినప్పటికీ అధినాయకుడు కేసీఆర్ మదన్‌లాల్‌కే టిక్కెట్ ఇచ్చారు. అయితే మదన్‌లాల్ స్వతంత్ర అభ్యర్థి రాములునాయక్‌పై ఓటమిని చవిచూశారు. ఎమ్మెల్యే రాములునాయక్ బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ 2023 ఎన్నికల్లో కేసీఆర్ మళ్లీ మదన్‌లాల్‌కే టిక్కెట్ ఇచ్చి ఆయన సమర్థతను గుర్తించారు. అయితే ఈ ఎన్నికల్లో కూడా మదన్‌లాల్ ఓడిపోయారు. కొంతకాలం తర్వాత ఇప్పుడిప్పుడే మళ్లీ నియోజకవర్గంలో పర్యటనలు చేపట్టారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గంలో ఇన్‌చార్జ్‌గా వ్యవహరించి పార్టీ కార్యకర్తలను సభకు తరలించి మళ్లీ వారందరికి దగ్గరవుతున్నారు. తమ మధ్యనే తిరుగుతూ కొద్దిరోజుల కిందట హైదరాబాద్ వెళ్లిన మదన్‌లాల్ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.

శోభారాణికి ఎమ్మెల్యే నివాళి

తల్లాడ, మే28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన దాసరి శోభారాణికి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నివాళులర్పించారు. బుధవారం గ్రామంలో ఆమె కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

క్రషర్ మిల్లు తనిఖీ

ముదిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం ఖానాపురంలో పండ్రేగుపల్లి గ్రామరెవెన్యూలోని బీవీఆర్ స్టోన్ క్రషర్‌ను ఆర్డీవో నర్సింహారావు బుధవారం తనిఖీ చేశారు. ఖానాపురానికి చెందిన కొందరు గ్రామస్థులు క్రషర్ మిల్లుకు ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్నారని, బ్లాస్టింగ్ వల్ల గ్రామంలో ఇబ్బందులు పడుతున్నామని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో స్టోన్ క్రషర్‌ను పరిశీలించి సంబంధిత పత్రాలను యాజమాన్యం నుంచి సేకరించారు. గ్రామస్థులతో మాట్లాడి ఆర్డీవో వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఆర్ఐ ప్రసన్నకుమార్, వహీదా పాల్గొన్నారు.

డ్రెయినేజీ పరిశీలన

వైరా, మే 28 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 12,13వార్డుల్లో బుధవారం మునిసిపల్ కమిషనర్ చింతా వేణు పర్యటించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఈ రెండు వార్డుల పరిధిలోని పలు వీధుల్లో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీలను పరిశీలించారు. పారిశుధ్య సిబ్బంది, ఎక్స్‌కవేటర్‌తో డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగును, చెత్తాచెదారాన్ని తొలగించే పనులు చేపట్టారు.

ఎన్‌సీసీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్‌లు

వైరా, మే 28 (ఆంధ్రజ్యోతి): వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ స్కూల్లో గత వారంరోజుల నుంచి నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం వైరాలో ఎన్‌సీసీ క్యాడెట్‌లు ర్యాలీ చేశారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కే. భద్ర, ఏవో కల్నల్ నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణనిస్తున్నారు. ఆతర్వాత స్థానిక వైష్ణవి పాలోత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల నుంచి జాతీయ ప్రధాన రహదారి మీదుగా రెండుకిలోమీటర్ల దూరం ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. భద్ర, నవీన్‌యాదవ్, న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ఏఎన్‌వో థర్డ్ ఆఫీసర్ సీహెచ్.అపురూపదేవి పాల్గొన్నారు.

'లింగగూడెంలో' మాఇంటి-మణిదీపం

పెనుబల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ కల్లూరు ప్రాజెక్టు పరిధిలోని పెనుబల్లి సర్కిల్‌లోని లింగగూడెం గ్రామంలో బుధవారం మాఇంటి-మణిదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన షేక్. హుస్సేన్, రమ్య దంపతులను సన్మానించి స్వీట్‌బాక్సు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ, ఏఎన్‌ఎం కల్పన, అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, సుబ్బమ్మ, పద్మ, సీత, ఆశవర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో పిల్లల నమోదును పెంచుదాం

» టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రంజాన్



ముదిగొండలో ప్రచార జాత నిర్వహిస్తున్న దృశ్యం

ముదిగొండ, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదును పెంచి బడులను బలోపేతం చేద్దామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్.రంజాన్, పి.సురేష్, ఎం.నర్సయ్య పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలనే లక్ష్యంతో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాత మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో మండల బాధ్యులు ఎస్.సుధాకర్‌రావు, పి.రామకృష్ణ, పి.కృష్ణప్రసాద్, షేక్.నాజర్, పి.జగదీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రచార జాతకు మండల మాజీ ఉపాధ్యక్షుడు ఎం.దామోదర్, సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, రైతుసంఘం మండల అధ్యక్షుడు కందుల భాస్కర్‌రావు సంఘీభావం తెలిపారు.న

కొణిజర్ల, మే28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. ఆసంఘం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కొణిజర్ల, తనికెళ్ల, పల్లిపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు నాగేశ్వరరావు, యాసా సత్యనారాయణ శ్రీనివాస్, సీహెచ్ వీరస్వామి, ప్రసాద్‌రావు, ఖాదర్, శాంతయ్య, విద్యాసాగర్, సీపీఎం జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ పాల్గొన్నారు.

వైరా, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిని కాపాడుకుందాం... పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిద్ధామనే నినాదంతో యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం వైరాలో ప్రచార జాత నిర్వహించారు. విద్యార్థుల నమోదు కోసం యూటీఎఫ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వైరా మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, సంఘం జిల్లా కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, ఏ.సుధాకర్, ఎస్టీఎఫ్ నాయకుడు ఉపేందర్ తదితరులున్నారు.

కల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను నమోదు చేయాలని పిలుపు నిస్తూ ప్రజార జాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో విజయకుమార్, శ్రీనివాస్, రాంబాబు, సుజాత, నవ్య, పద్మ, రమాదేవి, సురేష్ చక్రవర్తి తదితరులున్నారు.



కొణిజర్లలో...

'నకిలీ'ల బెడదను అరికట్టాలి: సీపీఎం

వైరా, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నకిలీ విత్తనాలు అరికట్టాలని, రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం సుంకర సుధాకర్ అధ్యక్షతన జరిగిన సీపీఎం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడని మంత్రులు

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

చింతకాని, మే 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముగ్గురు మంత్రులున్న జిల్లా రైతాంగానికి ఉపయోగం లేకుండా పోయిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం మండల మహాసభలో పాల్గొని మాట్లాడారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మడిపల్లి కిరణ్‌బాబు, కొత్తపల్లి వెంకటేశ్వర్లుతో పాటు మరో 17 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మాదినేని రమేష్, మడిపల్లి గోపాలరావు, రాచబంటి రాము, వత్సవాయి జానకిరాములు, నన్నక కృష్ణమూర్తి, ఆళ్ల మాధవరావు, మాదినేని రవి, కిలారి కిరణ్, నున్న రామకోటయ్య, కొప్పుల వీరయ్య, కొంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు

బోనకల్, మే 28 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో పసునూరి వినయ్ కుమార్, ఎస్ఐ పి. వెంకన్నలు హెచ్చరించారు. సీపీ సునిల్‌దత్ ఆదేశాల మేరకు వైరా ఏసీపీ రెహమాన్ పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ బృందం మండలంలోని బుధవారం బోనకల్, ఆళ్లపాడు, రావినూతల తదితర గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు.

వైరా, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడిలో శ్రీవిజయలక్ష్మి ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో విత్తనాలు, స్టాక్ రిజిస్ట్రర్లను ఏవో మయాన్ మంజూఖాన్, ఎస్ఐ పి.రామారావు బుధవారం తనిఖీ చేశారు. విత్తన నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విత్తనాలు వచ్చిన వెంటనే స్టాక్‌ను రిజిస్ట్రర్లలో నమోదు చేయాలని, ధరల పట్టికను ప్రదర్శించాలని, రైతులకు విధిగా రసీదులు ఇవ్వాలని సూచించారు.

గ్రామాల్లో బీజేపీని పటిష్ఠం చేయాలి

మధిరటౌన్, మే28(ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయిలో బీజేపీ పార్టీని పటిష్ఠం చేసేలా కార్యకర్తలు పని చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి నున్నా రవికుమార్, జిల్లా శక్తి కేంద్ర ప్రముఖ్ మందడపు నరసింహారావు, జిల్లా నాయకుడు జ్వాలా నరసింహారావు అన్నారు. బుధవారం మధిరలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ మధి ర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరా వు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీహరి, శివ రాజు సుమంత్, పెరుమాళ్లపల్లి విజయరాజు, చిలివేరు సాంబశివరావు, రమేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దశాబ్ది వేడుకలు

కొణిజర్ల, మే28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆయుష్ యోగా ఆధ్వర్యంలో బుధవారం కొణిజర్లలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నందు హరితయోగా పేరుతో మొక్కలను నాటు ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయుష్‌యోగా ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. జూన్ 21 వరకు యోగా దశాబ్ధి ఉత్సవాలను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. కరోనా వంటి మహమ్మారి నుంచి ప్రజలను రక్షించింది కేవలం యోగానేని అన్నారు. యోగాను అన్ని వయస్సుల వారు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో దుర్గాభవాని, స్టాఫ్‌నర్సు రజని, కల్పన, సంధ్యారాణి తదితరులున్నారు.

రసాయన ఎరువులను సమపాళ్లలో వాడాలి

» అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్



మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

సత్తుపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి):రసాయన ఎరువులను సమతుల్యంగా వాడాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జె.హేమంత్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం సత్తుపల్లి మండలం కొత్తూరు రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి చేయటం, పంట అవశేషాలను భూమిలో కలియదున్నటం వలన భూసారం పెరుగుతుందన్నారు. వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విత్తనాలు, రసాయనాలు కొనుగోలు చేసిన సమయంలో రైతులు తప్పనిసరిగా రసీదులను భద్రపరుచుకోవాలన్నారు. వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త ఎం.రాంప్రసాద్ మాట్లాడుతూ భూసార పరీక్షలకు మట్టి నమూనాను సేకరించే విధానం వివరించారు. డాక్టర్ రమేష్ ఉద్యాన పంటల సాగు మెళకువలను వివరించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ప్రదప్, పశువైద్యాధికారి శశిదీప్‌లు మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను కూడా రైతులు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు నరేష్, ఆశాజ్యోతి, వాసంతిలు పాల్గొన్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

» అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

బోనకల్, మే 28 (ఆంధ్రజ్యోతి): భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి సాధ్యమైనంత తొందరగా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన రెవెన్యూ అధికారులతో రెవిన్యూ సదస్సుల నిర్వహణకు సంబంధించి సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. రమాదేవి, గిర్దావర్లు మైథిలీ, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు అందుకున్న కల్లూరు గురుకుల ప్రిన్సిపాల్

కల్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదగా బుధవారం కల్లూరు సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయ ప్రిన్సిపాల్ కనకదుర్గ ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని బాబు జగ్జీవన్‌రావ్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా అవార్డుతో పాటు, పాఠశాల, కళాశాల అభివృద్ధికి గాను రూ. 5 లక్షల నగదు చెక్కును అందజేశారు. జోన్-4 పరిధిలో ఈ ఏడాది కల్లూరులోని గురుకుల విద్యాలయంలో పదవతరగతి, ఇంటర్మీడియట్ సెంకడియర్‌లో 100 శాతం ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను రాష్ట్ర స్థాయిలో ఈ అవార్డును అందుకున్నారు.

సొసైటీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన

బోనకల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం, పెద్దబీరవల్లి గ్రామాల్లో బుధవారం సొసైటీ భవన నిర్మాణాలకు చైర్మన్లు బత్తినేని నాగ ప్రసాద్, చింతలచెర్వు కోటేశ్వరరావులు శంకుస్థాపన చేశారు. నారాయణపురం సొసైటీకి రూ.30 లక్షల విలువ చేసే స్థలాన్ని చైర్మన్ నాగ ప్రసాద్ సొంత డబ్బులతో కొనుగోలు చేసి విరాళంగా ఇచ్చారు. సొంత డబ్బుతో స్థలాన్ని కొనుగోలు చేసి సొసైటీకి ఇచ్చినందుకు గానూ చైర్మన్‌ను అందరూ అభినందించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కారేపల్లి, మే28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఎంపీడీవో సురేందర్, డీడీ కృష్ణమూర్తి, ఏవో బట్టు అశోక్ కుమార్, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, డేగల ఉపేందర్, కొత్తురి రామారావు, మర్రికట్ల రోషయ్య, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు, మే28 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు బుధవారం ఏఎంసీ చైర్మన్ ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ శ్రీనువాసరావు, కాంగ్రెస్ నాయకులు లక్కినేని కృష్ణ, పోట్రు అర్జునరావు, తక్కెళ్లపాటి ప్రసాద్, బాగం ప్రభాకరచౌదరి, పెద్దబోయన శ్రీను, దేవాలయం చైర్మన్ దార రంగా, బైర్ల కాంతరావు, పొన్నూరు వెంకటేశ్వరరావు, ఆళ్లా నరిసింహారావు పాల్గొన్నారు.

పెనుబల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతకారాయిగూడెం సొసైటీలోని రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను కల్లూరు ఏఎంసీ చైర్‌పర్సన్ బాగం నీరజాచౌదరి బుధవారం పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భూసారాన్ని పెంచుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ రాచబోయిన కోటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ చింతనిప్పు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పంది వెంకటేశ్వరరావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరాజు, ఏఈవోలు సమంత, హర్ష నందిని, బుచ్చిబాబు, రైతులు పాల్గొన్నారు.



కారేపల్లిలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

30నుంచి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

వైరా, మే 28 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో ఈనెల 30నుంచి పచ్చిరొట్ట(జీలుగ, జనుములు) విత్తనాలను పంపిణీ చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి మయాన్ మంజూఖాన్ తెలిపారు. 1,250క్వింటాళ్ల జీలుగులు, 110క్వింటాళ్ల జనుములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైరా, పూసలపాడు, గరికపాడు సొసైటీల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కూపన్లు తీసుకున్న 24గంటల్లోపులో విత్తనాలు తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.